జల పుష్పాలకు వేసవి సెగ

- అధిక ఉష్ణోగ్రతలతో చేపలు, రొయ్యల ఉక్కిరిబిక్కిరి
- ఆక్సిజన్ తక్కువై మృత్యువాత
- గగ్గోలు పెడుతున్న ఆక్వా రైతులు


ఆక్సిజన్ లోపించడంతో పల్లంకుర్రులో చేస్తున్న చేపల పట్టుబడి

కాట్రేనికోన: వేసవి కాలం సూర్య ప్రతాపంతో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలతో పాటు, లోఓల్టేజీ, విద్యుత్ కోతలతో చెరువుల్లోని రొయ్యలు, చేపలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు చెరువులోని ప్లాంక్టాన్ చనిపోవడం, కరెంట్ కోతలు అధికం కావడంతో ఆక్సిజన్ లోపం వచ్చి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, మామిడికుదురు, రాజోలు, మల్కిపురం మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. మిశ్రమ పద్ధతిలో చేపల సాగు, ఫాలికల్చర్(మిశ్రమ పద్ధతిలో రొయ్యలు, చేపలు సాగు), వెనామీ రొయ్యలు మూడు పద్ధతులలో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు.

చనిపోతున్న ప్లాంటేషన్

అధిక ఉష్ణోగ్రతకు చెరువు నీటిలోని ప్లాంటేషన్ చనిపోవడంతో నీరు పలచబడి నేరుగా సూర్యరశ్మి చెరువు అడుగు భాగానికి చేరుతుంది. సూర్య కిరణాలు చెరువు అడుగుకు చేరడంతో అక్కడి మట్టి పాడైపోయి, మట్టి తెట్టలుగా పైకి చేరుతుంది. దీంతో చెరువు నీటి, మట్టి నాణ్యత దెబ్బతింటుంది. చెరువుల్లోని ప్లాంటేషన్ క్రాస్ కావడంతో జలచరాలు మేతలు సకాలంలో తినడం లేదు. చేపలు, రొయ్యలు తినగా, మిగిలిన మేత చెరువు అడుగు భాగానికి చేరి, కుళ్లిపోవడంతో.. అమ్మోనియం నైట్రేట్ వంటి విష వాయువులు తయారవుతున్నాయి. చెరువు నీటి నాణ్యతను పెంచేందుకు, విష వాయువుల స్థాయిని తగ్గించేందుకు జియోలైట్ వంటి మందులను ప్లాంటేషన్ ఉత్పత్తి కోసం అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఆక్సిజన్ స్థాయి తగ్గడంతో..

ఎండలకు చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి తగ్గిపోయి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రొయ్యల సాగులో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు చెరువుల్లో రైతులు ఏరియేటర్లతో ఆక్సిజన్‌ను అందిస్తారు. ఎండలకు తోడు కరెంట్ కోతలు అధికం కావడంతో చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి గణనీయంగా తగ్గి రొయ్యలు చనిపోతున్నాయి. రొయ్యల చెరువుల్లో వెనామీ రొయ్యలు రన్నింగ్ మోర్టాలిటీతో ఏరియేటర్ల దగ్గరకు చేరి అధిక మొత్తంలో చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

ఉష్ణోగ్రతల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని లోఓల్టేజీ, కరెంట్ కోతలు లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తాను. సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరాను క్రాస్ చెక్ చేసి, లోఓల్టేజీ సమస్య ఉన్నట్లయితే పరిష్కారానికి కృషి చేస్తా.
– శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏఈ, కాట్రేనికోన

ఆక్సిజన్ స్థాయి పడిపోతుంది

అధిక ఉష్ణోగ్రతలతో చెరువులోని ఆక్సిజన్ స్థాయి పడిపోయి రొయ్యలు పైన ఈదుతున్నాయి. చెరువులోని రొయ్యలు రన్నింగ్ మోర్టాలిటీతో ఏరియేటర్ల దగ్గర పడి చనిపోతున్నాయి.
– బి.శ్రీనివాసరావు, ఆక్వా రైతు, లైన్‌పేట

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

కాట్రేనికోన మండలంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెయ్యేరు సబ్ స్టేషన్‌లో రెండు, కాట్రేనికోన సబ్ స్టేషన్‌లో ఒకటి చొప్పున ఐదు పీటీఆర్‌లను తొలగించి, ఎనిమిది ఏర్పాటు చేశారు. వాటిని ఐదు పీటీఆర్ సరఫరాలోనే ఉంచడంతో లోఓల్టేజీ సమస్య అధికంగా ఉందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వార్డుల్లో సమస్యలపై కమిషనర్ సమీక్ష


కౌన్సిలర్లతో సమీక్షిస్తున్న కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఆయా వార్డుల కౌన్సిలర్లతో తన కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ప్రధానంగా 3, 6, 7, 9, 25, 27, 28 వార్డుల్లోని అనేక ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై కౌన్సిలర్లతో చర్చించారు. త్వరలోనే వార్డుల్లో కౌన్సిలర్లు సూచించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు, అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. కౌన్సిలర్లు ఏడిద శ్రీను, బండారు గోవిందు, గండి హారిక, గొలకోటి విజయలక్ష్మి, ఆయా వార్డుల నాయకులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

30 వరకు సెక్షన్–30 అమలు

అమలాపురం టౌన్: పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు సెక్షన్–30 అమలు చేస్తున్నట్లు డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు ఇది వర్తిస్తుందన్నారు. దీని ప్రకారం పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ, ఎలాంటి కార్యకలాపాలు చేయకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ఊరేగింపులు వంటివి నిర్వహించడానికి నిషేధం ఉందన్నారు. అలాంటి కార్యకలాపాల నిర్వహణకు ముందుగా డీఎస్పీ అనుమతి పొందాలని తెలిపారు. సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను నిరోధానికి విధించిన సెక్షన్–30 అమలుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా నిషేధాజ్ఞలను ఉపక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని డీఎస్పీ హెచ్చరించారు.

శ్మశానం అభివృద్ధికి భూమిపూజ

తాళ్లరేవు: లయన్స్ కైలాస భూమిగా అభివృద్ధి చేసే పనులకు స్థానిక పెంకేవారిపేటలో ఉన్న శ్మశాన వాటికలో తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు గురువారం భూమిపూజ చేశారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో శ్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, లయన్స్ ప్రతినిధులు నడింపల్లి వినోద్, బి.శ్రీనివాసరెడ్డి, గాదిరాజు సతీష్‌రాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ గౌరవ చైర్మన్‌గా శ్రీరాములు

అమలాపురం రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మడికి శ్రీరాములు ఏపీ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ గౌరవ చైర్మన్, రాష్ట్ర చర్మకార సేవా సంఘం గౌరవ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయా సంఘాల అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా కామనగరువు విక్టోరియాపేటలో గురువారం దండోరా నాయకులు సవరపు నానిబాబు ఆధ్వర్యంలో శ్రీరాములును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేదునూరి వెంకటరెడ్డి, ముస్కూడి సతీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి అందని ఆహ్వానం!

యానాం: నాలుగు రోజులుగా యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రవేశ ఉత్సవాలకు స్థానిక శాసన సభ్యుడైన తనను ఆహ్వానించడం లేదని గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. తనను ఉద్దేశపూర్వకంగా ఆహ్వానించడం లేదని, ఆర్ఏఓ మునిస్వామి ఏకపక్ష ధోరణితో అన్ని ప్రభుత్వ శాఖలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని వ్యవహరిస్తున్నారని విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పాఠశాల ప్రవేశ ఉత్సవాల్లో భాగంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వ్యక్తిగతంగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు వంటివి అందిస్తున్నారని విద్యాశాఖాధికారి లక్ష్మణ్ ప్రవీణ్ విలేకరులకు వివరణ ఇచ్చారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే ఆయనను ఆహ్వానిస్తున్నారని, ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు ఇచ్చేటప్పుడు ఎమ్మెల్యే అశోక్‌ను ఆహ్వానిస్తామన్నారు.

శ్మశాన వాటికకు ఫ్రీజర్ బాక్సు

అమలాపురం టౌన్: పట్టణంలోని 29వ వార్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికకు రెండో వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ, మాజీ కౌన్సిలర్ ఆదిబాబు దంపతులు రూ.లక్ష విలువైన ఫ్రీజర్ బాక్సును సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.10 లక్షల వ్యయంతో ఈ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తన తల్లిదండ్రులు దివంగత ఆశెట్టి సత్యనారాయణ, భారతమ్మ జ్ఞాపకార్థం ఈ ఫ్రీజర్ బాక్సును సమకూర్చుతున్నట్లు ఆదిబాబు తెలిపారు. శ్మశాన వాటిక పునః ప్రారంభం రోజున ఫ్రీజర్ బాక్సును అందజేస్తామని చెప్పారు. మృతదేహాలను తాత్కాలికంగా భద్రపర్చేందుకు మున్సిపల్ కాలనీ సమీపంలోని రోటరీ కైలాసభూమికి ఫ్రీజర్ బాక్సు ఉన్నట్లే, డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికకు దీనిని సమకూర్చుతున్న ఆదిబాబు దంపతులకు శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

రుణాల కోసం నేడు ఇంటర్వ్యూలు

ముమ్మిడివరం: మండలంలోని 16 పంచాయతీల్లో బీసీ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తాడి వెంకటాచార్య తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు దరఖాస్తు పత్రాలు, ఫొటోలు, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని తెలిపారు.

వంతెన నిర్మాణానికి ఆక్రమణలు తొలగించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం


ఈదరపల్లి వంతెన నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్. చిత్రంలో ఎమ్మెల్యే, ఎస్పీ తదితరులు

అమలాపురం రూరల్: పట్టణంలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిన కారణంగా ఈదరపల్లిలో నూతన వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఈదరపల్లి వంతెన వద్ద రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలు, నూతన వంతెన నిర్మాణాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎస్పీ కృష్ణారావు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వంతెన స్థితిగతులు, ఇతర అంశాలను కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను నిశితంగా పరిశీలించి, వంతెన నిర్మాణానికి అడ్డంకులు లేకుండా పూర్తిగా ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆయా ఆక్రమణల వివరాలను ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్లు రికార్డుల ఆధారంగా కలెక్టర్‌కు వివరించారు. ఆక్రమణలను పూర్తిగా తొలగించి, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో వచ్చే నెలలో నూతన వంతెన నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం నడిపూడి లాకు వద్ద ట్రాఫిక్ మళ్లింపు కోసం ఎమ్మెల్యే ప్రతిపాదించిన నూతన వంతెన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు, తహసీల్దార్ పలివెల అశోక్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ వర్మ, ఏఈ తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలకు ఘన సత్కారం


సర్వేశ్వరశర్మ, పైడిపాలను సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల ఉగాది పురస్కారాలు అందుకున్న పట్టణానికి చెందిన కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, సినీ గేయ, కవుల పరిశోధకుడు, కవి డాక్టర్ పైడిపాలను వాకర్స్ ప్రతినిధులు గురువారం ఉదయం ఘనంగా సత్కరించారు. వాకర్స్ అయిన డాక్టర్ సర్వేశ్వరశర్మ, డాక్టర్ పైడిపాలను స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వాకింగ్ ట్రాక్ వాకర్స్ ఆధ్వర్యంలో ఈ అభినందన సత్కారం జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కో–ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ సత్కార కార్యక్రమం జరిగింది. సహచర వాకర్లు అయిన సర్వేశ్వరశర్మ, పైడిపాల ఉగాది పురస్కారాలు అందుకోవడం వాకర్స్‌కు గర్వకారణమని వక్తలు అభినందించారు. వాకర్స్ ప్రతినిధులు గొవ్వాల రాజేష్, జవ్వాది తాతబాబు, టి.రమేష్ బాబు, వి.శ్రీనివాసరాజు, శివప్రసాద్, సుందర రామయ్య, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేసేది గోరంత.. చెప్పేది కొండంత!

- 81 రుణాల కోసం ఇంటర్వ్యూలకు 1,100 మంది హాజరు
- మున్సిపల్ కార్యాలయం వద్ద పడిగాపులు


వివిధ రుణాల కోసం అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద యువత పడిగాపులు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వంలో ఇచ్చేది స్వల్పమే అయినా.. ప్రచార ఆర్భాటం మాత్రం భారీగా ఉంటుందనేది అందరికీ తెలిసిందే. అమలాపురం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో వివిధ సామాజిక వర్గాలకు పలు కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రుణాల కోసం గురువారం జరిగిన ఇంటర్వ్యూలే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. రుణాలు ఇచ్చేది 81 మందికి మాత్రమే. ఇంటర్వ్యూలకు హాజరైంది మాత్రం 1,100 మంది. పట్టణంలోని 30 వార్డుల నుంచి ఆశావహులైన అభ్యర్థులు ఈ రుణాల కోసం ఇబ్బడిముబ్బడిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కొందరు మున్సిపల్ కౌన్సిలర్ల అత్యుత్సాహం, కొందరి అధికారుల మాటలు విని.. రుణం వస్తుందని, ఉపాధి సమకూరుతుందన్న ఆశతో అభ్యర్థులు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, పట్టణంలోని పలు వాణిజ్య బ్యాంకుల అధికారులు, బీసీ, ఓబీసీ కార్పొరేషన్ల అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. అభ్యర్థులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో, వార్డుల్లో ఎవరికి సిఫార్సు చేయాలో తెలియక అయోమయంతో కౌన్సిలర్లు చేతులెత్తేశారు. కొందరు అభ్యర్థులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణాలు ఇవ్వని దానికి తమను రప్పించి, గంటల తరబడి నిరీక్షించేలా చేశారని మండిపడ్డారు. వాస్తవానికి పట్టణానికి కాపు కార్పొరేషన్ నుంచి 33, బీసీ కార్పొరేషన్ నుంచి 39, ఓబీసీ నుంచి 9 రుణాలు మాత్రమే అంటే, మొత్తం 81 రుణాలు మంజూరయ్యాయి. ఇంటర్వ్యూలకు పట్టణంలోని కొన్ని వాణిజ్య బ్యాంకుల అధికారులు సైతం హాజరుకాలేదు. దీంతో పట్టణానికి మంజూరైన రుణాల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను అతికష్టంగా నిర్వహించారు.

70 యూనిట్లు.. 1,309 దరఖాస్తులు


ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయానికి భారీగా తరలివచ్చిన అభ్యర్థులు

ఉప్పలగుప్తం: బీసీ, ఓబీసీ, కాపు కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ, బీసీ కార్పొరేషన్ మెడికల్‌కు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా బ్యాంకుల అధికారులు హాజరయ్యారు. మండలంలోని 17 గ్రామాల నుంచి 1,309 మంది ఆశావహులు తరలివచ్చారు. మండలంలోని ఐదు బ్యాంకుల నుంచి అధికారికంగా 70 యూనిట్లను ఎంపిక చేశారు. గ్రామాల్లో నాయకులు వారి ఆధిపత్యాన్ని ప్రదర్శించుకోవడానికి ప్రతి ఒక్కరికీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో, ఆశావహులు పెద్దఎత్తున తరలిరావడంతో కార్యాలయం ఉక్కిరిబిక్కిరిగా మారింది. వారి తాకిడిని తట్టుకోలేక బ్యాంకు ప్రతినిధులు ముఖం చాటేశారు. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో మంజూరయ్యే ఈ రుణాలకు పరోక్షంగా ఇంత మందిని ఇబ్బంది పెట్టడం న్యాయమేనా అంటూ చర్చించుకున్నారు.

పాస్టర్ మృతిపై సీబీఐ విచారణ జరపాలి


వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు, నాయకులు



తాళ్లరేవులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ముమ్మిడివరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సీబీఐ విచారణ జరిపించి, వాస్తవాలు నిగ్గుతేల్చాలని నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు, యూత్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కాశివాని తూము సెంటర్ నుంచి వారు తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని, క్రైస్తవులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఎంయూ సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల సంఘాల ప్రతినిధులు వజ్రపు జోసెఫ్, సరెళ్ల ఇమ్మానుయేల్, ఈతకోట పాల్‌రాజు, వీధి ప్రేమానందపాల్, ఉండ్రాజవరపు ప్రసాద్, పాల్ ప్రసాద్, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం స్పందించాలి

తాళ్లరేవు: పాస్టర్ ప్రవీణ్ మృతి నేపథ్యంలో గురువారం తాళ్లరేవులో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షులు, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ఆధ్వర్యంలో స్థానిక గుడ్డివానితూము సెంటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామ్యూల్ సాగర్ మాట్లాడుతూ, పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ప్రజలకు వాస్తవాలకు తెలియజేయాలని కోరారు. పాస్టర్లు దడాల సాల్మన్‌రాజు, మల్లాడి హోసన్నా, బీర జార్జిముల్లర్, పంపన జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

యానాం: పాస్టర్ ప్రవీణ్ చిత్రపటానికి యానాం రీజియన్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గురువారం స్థానిక పాస్టర్ కత్రి రాజు చర్చి సమీపంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. వివిధ చర్చి పాస్టర్లు హాజరయ్యారు. కొద్ది నిమిషాలు మౌనం పాటించారు.

భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ


సీతారామపురంలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీ సర్వే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం కోరంగి పంచాయతీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీతారామపురం మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈ ర్యాలీని తహసీల్దార్ పితాని త్రినాథరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రీ సర్వేకు ప్రభుత్వం 140 రోజుల గడువు ఇవ్వడం ద్వారా పారదర్శకంగా నిర్వహించే వీలుంటుందన్నారు. కోరంగి, పోలేకుర్రు, పి.మల్లవరం గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. మరో 15 రోజుల్లో కోరంగి పంచాయతీలో రీ సర్వే చేపట్టనున్నామని, రైతులకు అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. నోటీసు అందుకున్న ప్రతి భూ యజమాని తమ భూ హక్కు పత్రాలను చూపించి, రీ సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబు, రీ సర్వే డీటీ వీరబాబు, ఆర్ఐ జీఎస్‌వీ రామకృష్ణ, మండల సర్వేయర్ షఫీఉల్లా, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లు కొనసాగించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ముమ్మిడివరం: అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కాల పరిమితిని 60 ఏళ్లుగా పేర్కొంటూ ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకుని, రిటైర్మెంట్ కాల పరిమితి 62 ఏళ్లు కొనసాగించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోషియేషన్ విజ్ఞప్తి చేసింది. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు గురువారం కమిషనర్ పి.రవివర్మ, ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినప్పటికీ, కాలయాపన చేస్తూ ఇప్పుడు ఏపీసీఓఎస్‌లో ఉన్న ఉద్యోగులను 60 ఏళ్లకే రిటైర్ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏ పోరాటానికైనా సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పెట్టా శివప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, జి.రమేష్, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్ఎస్‌వైవీ రామరాజు, ఆర్ అరుణ, పి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శక్తి యాప్‌పై అవగాహన

అమలాపురం రూరల్: కామనగరువులో ది అమలాపురం జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు శక్తి యాప్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. యాప్ డౌన్‌లోడ్, వినియోగం, లైంగిక వేధింపులకు గురి కాకుండా ఎలా తప్పించుకోవాలనే అంశాలపై ఎస్సై పి.గంగాభవాని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సుధ, హెచ్‌సీ భవాని, ప్రిన్సిపాల్ కె.సూరిబాబు, కళాశాల డైరెక్టర్లు ఎం.రాంబాబు, జి.వీరస్వామి నాయుడు, ఎం.కిరణ్‌కుమార్, ఎం.సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అమలాపురం రూరల్: కామనగరువు, పేరూరు సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అమలాపురం పట్టణ, రూరల్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అమలాపురం డీఈఈ రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీ, వేంకటేశ్వరస్వామి గుడి, అమలాపురం రూరల్ మండలంలో పేరూరు, తోట్లపాలెం, ఎస్‌కేబీఆర్ కళాశాల, కొంకాపల్లి, ఎ.వేమవరం, ఇమ్మిడివరప్పాడు, కామనగరువు, వన్నెచింతలపూడి, సమనస, రంగాపురం, సవరప్పాలెం, రెడ్డిపల్లి, చిందాడగరువు, తాండవపల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

ట్రాఫిక్ పోలీసులకు వేసవి సామగ్రి

అమలాపురం టౌన్: వేసవి దృష్ట్యా పట్టణంలోని ట్రాఫిక్ పోలీసులకు స్థానిక రామకృష్ణ మిషన్ పలు వస్తువులను సమకూర్చింది. స్థానిక కలెక్టరేట్ రోడ్డులోని మిషన్ కార్యాలయంలో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసులకు వీటిని అందజేశారు. పట్టణ ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఎస్సై ఏసుబాబుతో పాటు, పది మంది సిబ్బందికి కూలింగ్ కళ్లజోళ్లు, తెలుపు టోపీలు, రాగి కూలింగ్ బాటిళ్లు, గ్లూకోజ్ బాటిళ్లు, శానిటైజర్లను రామకృష్ణ మిషన్ సమకూర్చింది. అనంతరం సంస్థ ప్రతినిధులు డాక్టర్ గోదశి గంగరాజు, పవన్ తదితరులు పోలీస్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులను సత్కరించారు. డాక్టర్ గంగరాజు అన్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ఎల్జీకి ఫిర్యాదు

యానాం: రెండు నెలలుగా యానాంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా స్తంభించడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని యానాం ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమస్యపై జోక్యం చేసుకోవాలని కోరుతూ ఎల్జీ కైలాషనాథన్‌కు లేఖ రాసినట్లు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా

తాళ్లరేవు: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించారు. మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ధర్నా చేపట్టారు. మాలలపై చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, ఉన్న రిజర్వేషన్‌ను విభజించరాదన్నారు.

మంచినీటి చెరువు గట్టు శుభ్రత

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలకు తాగునీరు అందిస్తున్న రక్షిత మంచినీటి చెరువు గట్టు, పరిసర ప్రాంతాల్లో గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా స్థానిక వైఎస్సార్ విగ్రహం సమీపంలో ఉన్న బొటానికల్ గార్డెన్, చెరువు గట్టు చుట్టూ పేరుకున్న వ్యర్థాలను వలంటీర్లు తొలగించారు. అనంతరం సంప్రదాయ క్రీడా పోటీలు జరిగాయి.

సాగునీటి ఎద్దడిపై చర్యలు

యానాం: నియోజకవర్గ పరిధిలో శివారు దరియాలతిప్ప ఆయకట్టు తదితర ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో పలువురు రైతులు సాగునీటి ఎద్దడిపై ఫిర్యాదు చేశారు. దీనిపై పీడబ్ల్యూడీ ఏఈ కాళ్ల నాగరాజుతో ఆయన మాట్లాడారు. వంతుల వారీ విధానంలో శుక్రవారం యానాం వంతు వస్తుందని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

అమలాపురం రూరల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా జీఎంసీ బాల స్టేడియంలో జై భీమ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ పోటీలను గురువారం డాక్టర్ కారెం రవితేజ, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఐటీ విభాగం సీఐ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో గూడాల సంతోష్–12, నగరం–11 జట్లు తలపడినట్టు నిర్వాహకులు తెలిపారు. రూరల్ ఎస్సై శేఖర్‌బాబు, డాక్టర్ దిలీప్‌కుమార్, సర్పంచ్ నక్కా అరుణకుమారి, దాసరి అరుణ, కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, చింతా రామకృష్ణ పాల్గొన్నారు.